సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 21 । ఫిబ్రవరి । 2024



సైబర్ నేరాలపై అవగాహన ముఖ్యం

సైబర్ నేరాలపై పోలీసులకు అవగాహన ముఖ్యమని, ప్రజలను అప్రమత్తం చేసే విధంగా ప్రచారం చేయాలని ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశించారు. -8లో



మండుతున్న గట్టు కొండ

అడవికి నిప్పు పెట్టడంతో బి.కొత్తకోట సమీపంలోని గట్టు కొండ, గర్రపుకొండ, అచ్చమ్మ కనుక అటవీ ప్రాంతాలు కాలిబూడి దవుతున్నాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.200
రెండోరకం	రూ.80	రూ.148

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 119 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	420	490
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1050.620 కిలోలు

న్యూస్‌రీల్

గ్రూప్-2 పరీక్ష కోసం కంట్రోల్ రూమ్

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో ఈ నెల 25వ తేదీన గ్రూప్-2 పరీక్ష రాసే అభ్యర్థుల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు కంట్రోల్ రూమ్ అభ్యర్థులకు అందుబాటులో ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలకు చేరుకోవడంలో ఏ ఇబ్బంది తలెత్తినా 08561-293006 నెంబర్‌కు ఫిబ్రవరి 23వ తేదీ నుంచి 25వ తేదీలలో కాల్ చేస్తే కంట్రోల్ రూమ్ వారు సహకరిస్తారని తెలిపారు.

పనుల్లో వేగం పెంచాలి

రాయచోటి: పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తెలిపారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, నోడల్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో స్పందన, సాధారణ ఎన్నికలు-2024, హౌసింగ్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, రీ సర్వే తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులలో నోడల్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ ప్రక్రియ త్వరగా పూర్తి అవ్వాలని చెప్పారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం



లేబాకు విజయభాస్కర్‌రెడ్డి

రాజంపేట రూరల్: వైఎస్సార్‌సీపీ మలేషియా ఎన్‌ఆర్‌ఐ కమిటీని ఏర్పాటు చేసినట్లు కన్వీనర్ లేబాకు విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఉటుకూరు రామకృష్ణా రెడ్డి, సురవరం వీరా రెడ్డి, సుహాస్, షేక్ బాబు, అవినాష్, నారాయణ తదితరులను కమిటీ ప్రతినిధులుగా నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

రాజంపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఎన్‌ఆర్‌ఐ విభాగ 'బహ్రెయిన్' కమిటీని నియమించారు. కో-కన్వీనరు వరదరాజు శివరాజు సోమవారం ఈ విషయం వెల్లడించారు. కన్వీనరుగా చమర్తి బలరామరాజు, కో-కన్వీనర్లుగా దొల్లా సురేష్‌బాబు, మహమ్మద్ ఇస్మాయిల్‌లను నియమించారన్నారు. గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్స్‌గా పితాని రమేష్, సాయిరాం, జి.సుబ్రమణ్యం రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబరుగా కనపర్తి కేశవ రెడ్డి, వరకల వెంకటేశ్వర్లు, గంగాధర్ మునెయ్యలు నియమితులయ్యారన్నారు.

కడప కార్పొరేషన్: వైఎస్‌ఆర్‌సీపీ కువైట్ కమిటీ కో కన్వీనర్‌గా షేక్ షా హుస్సేన్, దోహా, ఖతార్ కమిటీ కో కన్వీనర్‌గా షేక్ జాఫర్ హుస్సేన్‌లను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. కడప నగరంలోని మట్టి పెద్దపులి ప్రాంతానికి చెందిన షేక్ జాఫర్ హుస్సేన్ గత 15 ఏళ్లుగా దోహాలోనూ, వ్యాపారంలో ఉన్నారు.

ప్రొద్దుటూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్‌ఆర్‌ఐ విభాగం యూకే కమిటీ సభ్యుడిగా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన భూమిరెడ్డి కార్తీక్ రెడ్డిని నియమించారు.

ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సాగు చేసిన పంటను పరిశీలిస్తున్న ఇటలీ సంస్థ ప్రతినిధులు

చిన్నమండెం: మండలంలోని మల్లూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటలను ఇటలీ ఫ్యూచర్ ఫుడ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. వర్షాధార, మామిడిలో అంతర, వరిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పండించిన పంటలను ఆ ఆర్గనైజేషన్ సీఈఓ సార రోవెర్సెస్ పరిశీలన చేశారు. అలాగే మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా చేస్తున్న ఏ గ్రేడ్ మోడల్‌ను పరిశీలించారు. వాటి నుంచి వచ్చే ఆహార ఉత్పత్తులను తీసుకోవడం ద్వారా ఆరోగ్య లాభాలను పీహెచ్‌సీ డాక్టర్ సునీత ద్వారా సీఈఓ ఆరా తీశారు. మండల పరిధిలోని ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను పరిశీలించారు. అనంతరం మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం రామకృష్ణరాజు, రైతు సాధికార సంస్థ, రాష్ట్ర కన్సల్టెంట్ సురేంద్రరెడ్డి, జూపీఈ పవన్, ఎంటిఎల్ చందు, ఎస్‌ఎఫ్‌ఏ భాస్కర్, ఏపీఎం రెడ్డమ్మ, ఎంటీ శ్రీనివాసులు, మార్కెటింగ్ ఎంటీ పద్మావతి, మండల పాయింట్ పర్సన్ సుబ్రమణ్యం ఆచారి, మోడల్ మేకర్లు, మెంటార్లు, ఫార్మర్ సైంటిస్టులు, యూనిట్ ఇన్‌చార్జిలు, ఐసీఆర్‌పీలు, రైతులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కదులుతున్న టీడీపీ కూసాలు

- రాయచోటిలో మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి గరం గరం
- ప్రొద్దుటూరులో తన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోలేదని లింగారెడ్డి ఆవేదన
- మైదుకూరులో పార్టీ పుట్టినప్పటి నుంచి జెండా మోసినా విలువ లేదంటున్న రెడ్యం సోదరులు
- కమలాపురంలో పుత్తా నరసింహారెడ్డికి వీరశివా సెగలు
- జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి వైఖరిపై మండిపడుతున్న శ్రేణులు





రమేష్‌కుమార్ రెడ్డి, వరదరాజుల రెడ్డి, లింగారెడ్డి, పుత్తా నరసింహారెడ్డి, వీరశివారెడ్డి, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేయడం అసాధ్యమేనా? ముందు వచ్చిన చెవుల కంటే వెనుక వచ్చిన కొమ్ములు వాడి అన్నట్లుగా టీడీపీ అధినేత చంద్రబాబు వ్యవహరించడమే ఇందుకు కారణమా? పార్టీ ఆవిర్భావం నుంచి అంటిపెట్టుకుని ఉన్న తెలుగుతమ్ముళ్లను వేదనకు గురిచేస్తున్నారా? అనే ప్రశ్నలకు ఔను అనే విశ్లేషకులు సమాధానం ఇస్తున్నారు. విధేయతతో నిమిత్తం లేకుండా స్థాయిని బట్టి ఆపైనున్న నేతలు అణచివేస్తున్నారని పలువురు చెప్పుకొస్తున్నారు. వెరసి జిల్లాలో టీడీపీ కూసాలు కదులుతున్నాయి. అధినేత వైఖరిపై మండిపడుతూ జిల్లా నేతలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ జెండా మోసిన కార్యకర్తకు అదే జెండా అండగా ఉంటుందన్నది పాత మాట. కార్యకర్తల ఉన్నతి కాంక్షించే ఆ పార్టీలో ఇపుడు 'పొడుగు చేతుల పందేరం'గా వ్యవహారం నడుస్తోందని సీనియర్ నేతలు వాపోతున్నారు. విధేయులు, అవకాశవాదులను ఒకే గాటన కట్టేస్తున్నారనే ఆవేదనతో రగలిపోతున్నారు. కష్టపడ్డ వారికి గుర్తింపు అటుంచితే ఏకంగా పార్టీ నుంచి వెళ్లగొట్టే చర్యలకు పాల్పడుతున్నారు. ఆవిర్భావం నుంచి టీడీపీని అంటిపెట్టుకున్న నేతలు సైతం పార్టీ మారే యోచనలో ఉన్నట్లు సమాచారం.

గరం గరంగా మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి

పదేళ్ల పాటు రాయచోటి నియోజకవర్గ ఇన్‌చార్జిగా, ఇరవై ఐదేళ్లు టీడీపీ నేతగా మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి ఆ పార్టీలో సేవలందిస్తున్నారు. తాజాగా ఈమారు టికెట్ ఇచ్చేది లేదని తేల్చి చెప్పడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యారు. వ్యక్తిగతంగా అధినేత చంద్రబాబుతో సమావేశపర్చమని రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును కోరినా ఫలితం లేకుండా పోయింది. దాంతో తీవ్ర ఆక్రోశానికి గురయ్యారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. పార్టీ కోసం ఇంతకాలం సేవలు పొంది ఎన్నికలు సమీపించినపుడు మొండి చేయి చూపుతారా? కనీసం పర్సనల్‌గా మాట్లాడే అవకాశం కూడా ఇవ్వరా? ఇలాంటి పార్టీ కోసం తాను ఇంకా పనిచేయాలా అంటూ రమేష్‌రెడ్డి రగిలిపోతున్నట్లు సమాచారం. ఆ మేరకే మండలాలవారీగా నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. వాస్తవ పరిస్థితులను వివరిస్తూ వారి మద్దతు కోరుతున్నారు. ఆయనకు లక్కిరెడ్డిపల్లె మండల టీడీపీ నాయకులు మూకుమ్మడిగా మద్దతు తెలిపారు. ఇన్‌చార్జి రమేష్‌రెడ్డి అభ్యర్థిత్వం ఖరారు చేయాలని అలా చేయని పక్షంలో తమ రాజీనామాలు స్వీకరించాలని అల్టిమేటం జారీ చేశారు. రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా నాయకుల మద్దతు కోరుతున్న రమేష్‌రెడ్డి సైతం ఇక ఉపేక్షించరాదనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అవసరమైతే జిల్లాలో టీడీపీ భూస్థాపితానికి శాయశక్తులా కృషి చేయాలనే దిశగా సన్నిహితులతో మంతనాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

లింగారెడ్డిని కనుమరుగు చేసిన అధిష్టానం

ప్రొద్దుటూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా నాలుగు సార్లు పోటీ చేసిన మల్లెల లింగారెడ్డి ఒక్కసారి విజయం సాధించారు. అప్పటి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డితో తలపడుతూనే.. జిల్లా అధ్యక్షుడిగా పలుమార్లు సేవలందించారు. 2009లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఈమారు ఆశావహుల్లో ఒకరైన నంద్యాల వరదరాజులరెడ్డి అభ్యర్థిత్వంపై ఆయన ఆక్షేపణ వ్యక్తం చేశారు. పార్టీలో చేరకుండానే టీడీపీ టికెట్ ఎలా అడుగుతారని నిలదీస్తూనే, ఆయనకే టికెట్ ఇస్తే పార్టీని నమ్ముకున్న తమలాంటి వారు సన్యాసం స్వీకరించాల్సి ఉంటుందని పరోక్ష హెచ్చరిక చేశారు. అంతే, ఏకంగా జిల్లా అధ్యక్ష పదవి నుంచి సైతం తప్పించారు. ఆ స్థానంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డిని కూర్చోబెట్టారు. కష్టకాలంలో సేవలందించిన తనను తప్పించడాన్ని లింగారెడ్డి జీర్ణించుకోలేకున్నారు. సరైన సమయంలో తగిన రీతిలో స్పందించాలనే దిశగా ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

పుత్తాకు వీరశివా సెగలు

కమలాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా పుత్తా నరసింహారెడ్డి పదహారేళ్లుగా కొనసాగుతున్నారు. మూడు పర్యాయాలు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. మరోమారు ప్రజా తీర్పు కోరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇలాంటి తరుణంలో మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటి నుంచి పుత్తాకు వీరశివా సెగలు తాకుతున్నాయి. తాజాగా మరోమారు కమలాపురం అభ్యర్థిత్వంపై ఐవీఆర్ ఫోన్ కాల్స్ రూపంలో ఇరువురు పేర్లపై టీడీపీ నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టడం విశేషం. ఈ వ్యవహారం వెనుక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ప్రమేయం ఉన్నట్లు పుత్తా వర్గీయులు విశ్వసిస్తున్నారు. మూడు సార్లు పోటీ చేసి పార్టీ ఉన్నతి కోసం పనిచేస్తున్న తనని కాదని, అవకాశవాదుల్ని తెరపైకి తెస్తారా? అని పుత్తా మండిపడుతున్నట్లు తెలుస్తోంది. ప్రొద్దుటూరు, కడప, కమలాపురం నియోజకవర్గాల్లో శ్రీనివాసులరెడ్డి ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్నారనే ఆవేదనను తెలుగుతమ్ముళ్లు వ్యక్తం చేస్తున్నారు. కడప పార్లమెంటు, అసెంబ్లీ ఎక్కడి నుంచైనా సరే శ్రీనివాసులరెడ్డి కుటుంబం పోటీ చేస్తే, ఓడించాలనే దిశగా స్వంత అన్న రమేష్‌రెడ్డి సైతం మండిపడుతున్నట్లు పలువురు చెప్పుకొస్తుండటం విశేషం.

రెడ్యంకు దక్కని ప్రాధాన్యత

మైదుకూరు నియోజకవర్గంలో రాష్ట్ర కార్యనిర్వాహక మాజీ కార్యదర్శి రెడ్యం సోదరుల పరిస్థితి కూడా పై వారికి భిన్నంగా ఏమీ లేదు. ఇన్‌చార్జి పుట్టా సుధాకర్ యాదవ్ పార్టీలో సీనియారిటీ ఉన్న నాయకుల్ని కనుమరుగు చేయాలనే ఎత్తుగడల్లో భాగంగా వారిని పక్కకు తప్పిస్తున్నట్లు సమాచారం. టీడీపీ ఆవిర్భావం నుంచి పనిచేసిన రెడ్యం సోదరులకు పార్టీలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

మొదలైన రాజీనామాల పర్వం

- రమేష్‌రెడ్డికి మద్దతుగా పలువురు నేతలు రాజీనామా
- టికెట్ ఇవ్వకపోతే ఆమోదించాలని లేఖ



రమేష్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని కోరుతూ సమావేశమైన టీడీపీ మండల నాయకులు

లక్కిరెడ్డిపల్లి : టీడీపీలో రాజీనామాల పర్వం మొదలైంది. రాయచోటి నియోజకవర్గంలోని లక్కిరెడ్డిపల్లి మండల స్థాయి నేతలు రాజీనామాల బాట పట్టారు. రెడ్డప్పగారి రమేష్‌రెడ్డికి టికెట్ విషయంలో జాప్యం చేస్తున్నందుకు టీడీపీ మండల అధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు ఆ పార్టీకి రాజీనామా చేసి జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజుకు, అధిష్టానానికి లేఖ ద్వారా పంపామని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాలాడి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. లక్కిరెడ్డిపల్లి టీడీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమేష్‌రెడ్డికి రాయచోటి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్ విషయంలో జాప్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. అధిష్టానం త్వరగా నిర్ణయం తీసుకొని ఆయననే అభ్యర్థిగా ప్రకటించాలని, లేని పక్షంలో తమ రాజీనామాలు ఆమోదించాలని కోరారు. గొర్ల మోహన్‌రెడ్డి (టీడీపీ మండల అధ్యక్షుడు), రెడ్డప్పగారి నాగేంద్రరెడ్డి (టీడీపీ సీనియర్ నాయకుడు), కాలాడి ప్రభాకర్‌రెడ్డి (టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి), తిమ్మిరెడ్డి ఉమాపతిరెడ్డి (టీడీపీ మాజీ ఎంపీపీ), శంకారపు జయరాం (టీడీపీ బీసీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి), యూనిట్ ఇన్‌చార్జిలు ఎస్.అజంతుల్లా, వేమిరెడ్డి, రవిరెడ్డి, బడుగు వాసుదేవుడు, వెంకట రామరాజు, ఎం లక్ష్మీనారాయణ రాజీనామాలు చేసి అధిష్టానానికి పంపినట్లు ప్రకటించారు.

పేదింటి ఆడపిల్లకు ఆర్థిక భరోసా

- వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా నిధుల విడుదల
- జిల్లాలో 356 మందికి రూ.2.91 కోట్లు జమ
- జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్, జిల్లా అధికారులు

రాయచోటి: నిరుపేద ఆడపిల్లల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకాలను ప్రవేశ పెట్టిందని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తెలిపారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా కింద అక్టోబర్-డిసెంబర్ 2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న 10,132 మంది అర్హులైన లబ్ధిదారులకు రూ.78.53 కోట్ల ఆర్థిక సాయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు. ఈ కార్యక్రమానికి రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, సోషల్ వెల్ఫేర్ డీడీ జాకీర్ హుస్సేన్, వెనుకబడిన తరగతుల జిల్లా అధికారి సందప్ప, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద కుటుంబాల తల్లిదండ్రులకు వారి పిల్లల వివాహాలు ఆర్థిక భారం కాకూడదని, వారిని ఆర్థికంగా ఆదుకోవడం కోసం వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. లబ్ధి పొందిన వారు వారి గ్రామాలలో లేదా పట్టణాలలో పేద కుటుంబాలలో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అన్నమయ్య జిల్లాలోని 356 మంది లబ్ధిదారులకు సంబంధించి రూ. 2,91,15000ల మెగా చెక్కును జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉన్నాం



ప్రభుత్వం నుంచి కల్యాణమస్తు సాయం అందడం చాలా ఆనందంగా ఉంది. మా కుటుంబానికి అనేక ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. జగనన్న అందిస్తున్న కల్యాణమస్తు సాయం మాకు ఎంతో ఉపయోగకరం. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

-నందినీ, తాటిమాయకుంట, రాయచోటి

షాదీతోఫా అందుకోవడం మా అదృష్టం



షాదీతోఫా ద్వారా లబ్ధి పొందడం మా అదృష్టంగా భావిస్తున్నాం. ఈ పథకం కోసం ఎలాంటి రెకమండేషన్‌లు చేయలేదు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి సహాయం అందించలేదు. సీఎం సార్ అందించిన ఈ సాయం మరిచిపోలేం.

-నజ్రియా, బేతల్ కాలనీ, రాయచోటి

ప్రభుత్వ బ్యాంక్‌ల్లో తక్కువ వడ్డీకే రుణాలు



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ బి.సత్యనారాయణ

సంబేపల్లె: ప్రభుత్వ బ్యాంకుల్లో తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ బి.సత్యనారాయణ తెలిపారు. సంబేపల్లెలోని మండల సమాఖ్య భవనంలో మంగళవారం ఆర్‌హెచ్‌జీబీఎంఎస్‌ఎస్ సంస్థ ఆధ్వర్యంలో పొదుపుదారుల అక్షరాస్యత, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు రుణయాప్‌లను ఆశ్రయించి ప్రాణాల మీదకు తెచ్చుకొంటున్నారని, కావున ఆర్థిక వ్యవహారాలలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు డీడీఎం బి.వి జయ విహారి, సంబేపల్లె ఏపీజీబీ బ్యాంక్ మేనేజర్ ఎస్‌కే రహమతుల్లా, దేవపట్ల కెనరా బ్యాంక్ మేనేజర్ బి.భరత్‌కుమార్‌రెడ్డి, రీసోర్స్ పర్సన్ నాగరాజు నాయుడు, సంజీవరాజు తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళిక.. ప్రతిభ చాటాలిక..!

- మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు
- ఉత్తమ ఫలితాలు విద్యార్థుల చేతుల్లోనే
- శ్రద్ధగా చదివితేనే విజయం తథ్యం



స్టడీ అవర్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు

మదనపల్లె సిటీ: పదో తరగతి పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా మార్గదర్శకాలు రూపొందించింది. ఈ మేరకు పిల్లలను సమాయత్తం చేయాలని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేసింది. ఏడు పేపర్ల విధానంపై స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆదేశించింది. పరీక్షల సమయం దగ్గర పడుతోంది. మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ప్రణాళిక బద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యమే. ఈ ఏడాది అన్నమయ్య జిల్లాలో 25,522 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ నేపథ్యంలో ఎలా సన్నద్ధం కావాలో సబ్జెక్టు నిపుణులు సూచిస్తున్నారు.

సమయం కీలకం

ఈ 27 రోజులు ఏడు సబెక్టులు ప్రణాళిక బద్ధంగా చదవాలి. ప్రణాళిక సిద్ధం చేసుకుంటే సీ, డీ గ్రేడుల్లోని విద్యార్థులు ఉత్తీర్ణత.. ఏ, బీ గ్రేడుల్లోని వారు ఆశించిన మేరకు మార్కులు సాధించే అవకాశం ఉంటుంది.

పదో తరగతి పరీక్షల వివరాలు



విద్యార్థులు	25,522
బాలురు	13,003
బాలికలు	12,519
పరీక్షా కేంద్రాలు	129

అర్థం చేసుకుని చదివితే ఆంగ్లం సులువే



విద్యార్థులు ఆంగ్లమంటే భయపడాల్సిన అవసరం లేదు. ఇచ్చిన అంశాలకు అనుగుణంగా సొంతంగా రాయడంపై సాధన చేయాలి. ఇంగ్లిష్ ప్రశ్నపత్రంలో మూడు సెక్షన్లలో 1-35 వరకు ప్రశ్నలుంటాయి. సెక్షన్ -ఏలో మూడు పాసేజీలు పాఠ్యాంశం నుంచి 15 ప్రశ్నలు ఇస్తారు. వీటికి 30 మార్కులు వస్తాయి. పాఠ్య పుస్తకంపై అవగాహనతో 30 మార్కులు సులభంగా సాధించవచ్చు. సెక్షన్-బిలో 16వ ప్రశ్న నుంచి 32వ ప్రశ్న వరకు 17 ప్రశ్నలు 40 మార్కులకు ఇస్తారు. పాఠ్యపుస్తకంలోని గ్రామర్, ఒకాబ్లరీ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ప్రతి పాఠ్యాంశం వెనుక ఉన్న గ్రామర్, ఒకాబ్లరీ చదవడం ద్వారా 40 మార్కులు సాధించే వీలుంది. -పి.మహమ్మద్‌ఖాన్, ఎస్‌ఏ(ఇంగ్లిష్), జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె

సూత్రాలపై పట్టు.. మార్కులు కొట్టు



గణితం సాధన చేయాల్సిందే. 1, 2, 4 మార్కుల ప్రశ్నలకు చాయిస్ లేదు. 8 మార్కుల ప్రశ్నలకు మాత్రమే చాయిస్ ఉంటుంది. ఒక మార్కు ప్రశ్నలపై దృష్టి సారిస్తే ఏ, బీ గ్రేడ్ విద్యార్థులు 95కు పైగా మార్కులు సాధిస్తారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థులు గ్రాఫ్‌లు, నిర్మాణాలు, పటాలపై దృష్టి సారిస్తే కనీసం 15 మార్కులు సాధిస్తారు. సమితులు, సంభావిత, సాంఖ్యక శాస్త్రం, త్రికోణమితి, వాస్తవ సంఖ్యలు శ్రద్ధగా చదివితే సీ, డీ గ్రేడ్ విద్యార్థులు ఉత్తీర్ణత పొందుతారు.

-పి.సుధాకర్‌రెడ్డి, స్కూల్ అసిస్టెంట్, గణితంజెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె

జీవశాస్త్రాన్ని ఇష్టంగా చదవాలి



ఈ ఏడాది పీఎస్, బయాలజీ ఒకే పేపరు ఉంటుంది. పార్ట్-ఏ పీఎస్ 50, పార్ట్-బీ బయాలజీ 50 మార్కులకు ఉంటుంది. 17 నుంచి 33 వరకు బయాలజీ ప్రశ్నలుంటాయి. ప్రయోగాలు, భేదాలు, చిత్రపటాలు, టేబుల్స్‌పై అవగాహన ఉండాలి. చిత్రపటాలు, ప్రయోగశాల కృత్యాలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. - ఎ.ఫణీంద్ర, ఎస్‌ఏ(బయాలజీ), జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె

అభ్యసనంతో హిందీలో రాణింపు



హిందీలో ఉత్తీర్ణతకు 20 మార్కులే ఉండటంతో భాషపై కొంత అవగాహన ఉంటే పాస్ కావొచ్చు. చదవడం, రాయడం, బాగా సాధన చేయాలి. రోజూ అరగంట హిందీకి కేటాయిస్తే 80 శాతం మార్కులు సాధించవచ్చు. వ్యాకరణ అంశాల మీద పట్టు సాధించాలి. - ఎ.వసుధ, ఎస్‌ఏ(హిందీ), జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె

పునశ్చరణ ముఖ్యం



భౌతిక, రసాయన శాస్త్రం కలిపి 50 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుంది. భౌతికశాస్త్రంలో కాంతి, విద్యుత్ యూనిట్లు, సూత్రాల ఉత్పాదన, గణన, నిత్యజీవిత వినియోగం, భేదాలపై దృష్టి పెట్టాలి. రసాయనశాస్త్రంలో కర్బక సమ్మేళనాలు, సమీకరణాలు, పరమాణు నిర్మాణం, లోహ సంగ్రహణ శాస్త్రంపై పట్టు సాధించాలి. -రసూల్‌బావాజీ, ఎస్‌ఏ(పీఎస్), జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె

తెలుగు.. పట్టు సాధిస్తే ఫలితాలు మెరుగు



తెలుగులో రామాయణంపై అవగాహన కలిగి ఉండాలి. సంఘటనలను క్రమంగా అమర్చగలిగి ఉండాలి. కంఠస్థం చేయకుండా చదివి ఆలోచించడం, సృజనాత్మకత వల్ల ఉత్తమ మార్కులు పొందవచ్చు. పాఠ్యాంశంలోని స్టార్ గుర్తున్న పద్యాలను ఎక్కువ సార్లు రాసి సాధన చేయాలి. -కృష్ణయ్య, తెలుగు ఉపాధ్యాయులు, జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె

చరిత్ర తెలుసుకుంటే ఉత్తమ ఫలితం



సోషల్‌లో పట్టికలు, గ్రాఫ్‌లు, మ్యాప్ పాయింటింగ్, సమాచార విశ్లేషణ సాధన చేయాలి. 1-12 ప్రశ్నల వరకు ఒక్క మాటలతో సమాధానం రాసే ప్రశ్నలున్నాయి. సబ్జెక్టుపై పట్టును సాధిస్తే సులువుగా ఆన్సర్ చేయవచ్చు. మ్యాప్ పాయింటింగ్‌లో ప్రశ్నలను విద్యా ప్రమాణాలను పరీక్షించేలా ఇస్తారు. -ఆర్.వి.రమణ, ఎస్‌ఏ (సోషియల్), జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె

క్లుప్తంగా

15 మద్యం బాటిళ్లు స్వాధీనం

రామాపురం : మండలంలోని గువ్వలచెరువులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మూడే భాస్కర్‌నాయక్ నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు మండల ఎస్‌ఐ వి.ఎల్.ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ముందస్తు సమాచారం రావడంతో తన సిబ్బందితో దాడి నిర్వహించామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గాలివీడు : మండల పరిధిలోని గరుగుపల్లె సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి రూ.3,050 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకట ప్రసాద్ తెలిపారు. ఒక వ్యక్తి పరారయ్యాడన్నారు. ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె సిటీ : ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడటంతో ఇద్దరు గాయపడిన సంఘటన మదనపల్లె మండలం కత్తిరివారిపల్లెలో మంగళవారం సాయంత్రం జరిగింది. మాలేపాడు పంచాయతీకి చెందిన ఈశ్వర్(31), గంగారాణి(30)లు ట్రాక్టర్‌లో సిమెంటును తీసుకుని గ్రామానికి వెళుతుండగా కత్తిరివారిపల్లె ట్రాక్టర్ అదుపుతప్పడంతో ఈశ్వర్, గంగారాణిలు గాయపడ్డారు. వీరిని స్థానికులు 108 వాహనం ద్వారా మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వృద్ధుడి ఆత్మహత్య


విశ్వనాథరెడ్డి(ఫైల్)

రామాపురం : మండలంలోని హసనాపురం పంచాయతీ మంగళపల్లికి చెందిన కొవ్వూరి విశ్వనాథ్‌రెడ్డి(75) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ వి.ఎల్.ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు వృద్ధుడు గత కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తన కుమార్తె రాయచోటిలో నివాసం ఉండటంతో సోమవారం అక్కడికి వెళ్లాడు. మంగళవారం రాయచోటి నుంచి ఆటోలో హసనాపురం చేసురుకున్నాడు. ఇంటికి వెళ్లకుండా వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. మృతుడి భార్యకు ఇటీవల చెయ్యి విరగడంతో సమీప బంధువులు ఎవరూ ఆదరించకపోవడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె సిటీ : వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్యయత్నా యత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. మదనపల్లె మండలం గంగన్నగారిపల్లెకు చెందిన కార్తీక్(28) కుటుంబ సమస్యలతో భార్యతో గొడవపడి ఎలుకల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. బి.కొత్తకోట మండలం బడికాయలపల్లె పంచాయతీ వలసగుట్టకు చెందిన మురళి (24) కుటుంబ సమస్యలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

సైబర్ నేరాలపై అవగాహన ముఖ్యం

నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ బి.కృష్ణారావు


నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు

రాయచోటి : సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రతి పోలీస్ అధికారికి అవగాహన ముఖ్యమని, లోన్ యాప్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేసే విధంగా వాటిపై ప్రచారం సాగించాలని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశించారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జిల్లా నేర సమీక్షా సమావేశాన్ని ఎస్పీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నమోదైన కేసులలో రికవరీ జరిగేలా ఎస్‌ఓపీ ప్రకారం దర్యాప్తు జరగాలని జిల్లా ఎస్పీ పోలీసు అధికారులకు సూచించారు. పెండింగ్ అట్రాసిటీ కేసులు, మహిళలకు సంబంధించిన కేసులు, గ్రేవ్, నాన్‌గ్రేవ్, మిస్సింగ్ కేసులు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కేసుల సత్వర పరిష్కారం, సక్రమ విచారణ కోసం సంబంధిత దర్యాప్తుపై అధికారులకు సూచించారు. రాత్రివేళ గస్తీ పెంచి డైనమిక్, బీట్స్, ఆస్తి నేరాలు జరిగే ప్రాంతాలపై నిఘా పెంచి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకొని చోరీ సొత్తు రికవరీ పెంచాలన్నారు. ఈ-బీట్స్ విధానాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. దర్యాప్తు పూర్తయిన కేసులలో చార్జిషీటు ఏ విధమైన ఆలస్యం లేకుండా ఫైల్ చేసి కోర్టులో విచారణ ప్రారంభం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటూ శాస్త్రీయ పద్ధతులలో కేసుల దర్యాప్తు వేగంగా పూర్తి చేయాలన్నారు. అలవాటుగా నేరాలు చేసే నేరస్తులను గుర్తించి ఎంపిక చేసిన నేరస్తులపై హిస్టరీ షీట్‌లను తెరవాలన్నారు. పక్క జిల్లాల పోలీస్ స్టేషన్ల అధికారులతో నిరంతరం సమాచారాన్ని పంచుకుంటూ వారి కదలికలపై నిఘా ఉంచి వారి ద్వారా భవిష్యత్తులో ఎలాంటి నేరాలు జరగకుండా నివారించాలన్నారు. స్పీడ్ ట్రయిల్ కేసులను త్వరితగతిన జడ్జిమెంట్ ఇచ్చేందుకు ప్రాసెస్‌ను పూర్తి చేయాలన్నారు. రౌడీషీట్ కలిగిన ప్రతి వ్యక్తి కదలికలపై నిఘా ఉంచి వారి ద్వారా శాంతయుత వాతావరణానికి భంగం కలగకుండా నిరంతరం అప్రమత్తతో ఉండాలని, అన్ని స్టేషన్ల అధికారులకు కచ్చితమైన ఆదేశాలు ఇచ్చారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని, వారి సమస్యలను ఓపికగా విని, చట్టపరిధిలో న్యాయం చేయాలని, ప్రజలలో పోలీస్ శాఖపై నమ్మకం కలిగే విధంగా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా ఎస్పీ వీబీ రాజ్ కమల్, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఉద్యోగానికి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరిక

ప్రొద్దుటూరు : కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని కడప ఆల్ ఇండియా రేడియో స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న నాగులారపు జయసింహా తన ఉద్యోగానికి రాజీనామా చేసి మంగళవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా ఎంపికైన ఈయన గత 12 ఏళ్లుగా ఆల్ ఇండియా రేడియో స్టేషన్‌లో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ జయసింహా తండ్రి నాగులారపు విజయసారథి కాలేజీ చదివే రోజుల నుంచి తన ఉన్నతికి పాటుపడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం జగనన్న అందిస్తున్న సుపరిపాలనకు ఆకర్షితులై ఆయన తనయుడు జయసింహా పార్టీలో చేరారన్నారు. త్వరలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసి జయసింహను పార్టీ పురోభివృద్ధికి వినియోగించుకుంటామని తెలిపారు. ఇంకా 30 ఏళ్ల సర్వీసు ఉన్న జయసింహా జగనన్న పార్టీకి సేవలు అందించాలన్న ఆశయంతో ఉద్యోగానికి రాజీనామా చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా జయసింహా మాట్లాడుతూ జగనన్న పార్టీ విధానాలకు ఆకర్షితులై ఉద్యోగానికి రాజీనామా చేశానన్నారు.



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు-నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

ఒక్కరోజులోనే ధ్రువీకరణ పత్రాలు అందాయి



గతంలో ఏవైనా ధ్రువీకరణపత్రాలు పొందాలంటే కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయినా సకాలంలో పత్రాలు అందేవికావు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మా ఇంటివద్దకే వలంటీర్లు వచ్చి మాకు అవసరమైన క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లు అందించారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే ఉచితంగా సర్టిఫికెట్లు అందించడం చాలా ఆనందంగా ఉంది. జగనన్నకు రుణపడి ఉంటాం.

– ఎల్.రామరాజు, అనంతపల్లి

సొంతింటి కల నెరవేరింది



మాది పుల్లంపేట మండలం, దళవాయిపల్లి గ్రామం. మాకు పొలం లేదు. వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత మాకు ఇంటిస్థలంతోపాటు ఇల్లు మంజూరు చేశారు. ప్రభుత్వం అందజేసిన సిమెంట్, కడ్డీలు, నగదుతోపాటు మా చేతుల కష్టాన్ని జోడించి ఇల్లు బాగా కట్టుకున్నాము. రాష్ట్ర ముఖ్యమంత్రి మా లాంటి పేదలను గుర్తించి ఇంటిస్థలం, ఇల్లు మంజూరు చేయడం చాలా ఆనందంగా ఉంది. జగనన్నకు రుణపడి ఉంటాం.

– బోదనపు మస్తానమ్మ, దళవాయిపల్లి గ్రామం, పుల్లంపేట మండలం

మండుతున్న గట్టు కొండ

- వందల హెక్టార్లలో అడవి దగ్ధం
- గుర్రపుకొండ, అచ్చమ్మ కనుమ మంటలకు ఆహుతి


గుర్రపుగుట్టపై కాలిపోతున్న అడవి

బి.కొత్తకోట : అడవికి నిప్పు పెట్టడంతో మంగళవారం సాయంత్రం మొదలైన మంటలు గాలికి వేగంగా వ్యాపిస్తూ బి.కొత్తకోట సమీపంలోని గట్టు కొండ, చలిమామిడి మార్గంలోని గుర్రపుకొండ, అచ్చమ్మ కనుక అటవీ ప్రాంతాలు కాలిబూడిదవుతున్నాయి. బి.కొత్తకోట-చలిమామిడి మార్గంలో డేగానిపల్లె దాటి వెళ్లాక అటవీప్రాంతం ప్రారంభమవుతుంది. ఈ అడవికి అనుకుని గట్టు కొండ ఉంది. ఇది బి.కొత్తకోట-మదనపల్లె మార్గంలో కొండకిందపల్లె వద్ద ఉంది. ఇందులో విలువైన వృక్ష సంపద, వన్యప్రాణులు ఉన్నాయి. మొదట అచ్చమ్మ కనుమ, గుర్రపుగుట్ట అటవీప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. తర్వాత గట్టు కొండకు నిప్పు పెట్టడంతో దావానలంలా వ్యాపించిన మంటలు సూరప్పగారిపల్లె వైపు నుంచి కొండకిందపల్లె వైపుకు ఉన్న కొండభాగమంతా మంటల్లో కాలిపోతూ విస్తరిస్తూ సాగుతోంది. ఈ మంటలకు మొక్కలు, అటవీ సంపద కాలిపోతోంది. దట్టమైన పొగ కమ్మేయడంతో రహదారిపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. అచ్చమ్మ కనుమ, గుర్రపుగుట్టలు చలిమామిడి రహదారికి ఇరువైపులా విస్తరించి ఉన్నాయి. ఈ అడవి కాలిపోతూ రహదారిపై నుంచి మంటలు వ్యాపించడంతో చలిమామిడి, సూరపువారిపల్లె, కొత్తవుడియం, దయ్యాలవారిపల్లె గ్రామాలకు బైక్‌లపై వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మంటల సెగలకు ముందుకు వెళ్లలేకపోయారు. రోడ్డుపై దూరంగా ఆగిపోవాల్సి వచ్చింది. మంటలు తగ్గాక గ్రామాలకు బయలుదేరారు. గుర్రపుగుట్టపై ఉన్న ఎర్రచందనం వృక్షాలకు నష్టం వాటిల్లింది. వాటికింద ఉన్న ఎండుగడ్డి, మొక్కలు కాలిపోతూ ఎర్ర చందనం వృక్షాలపై మంటల ప్రభావం పడింది. ఈ మంటల కారణంగా వందల హెక్టార్లలో అడవి కాలి బూడిదైంది.

‘పది’ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయండి


మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయుల సమావేశంలో జ్యోతి వెలిగిస్తున్న ఆర్‌జేడీ

రాయచోటి టౌన్: త్వరలో నిర్వహించబోయే 10వ తరగతి పరీక్షల కోసం విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఆర్‌జేడీ ఎద్దుల రాఘవరెడ్డి తెలిపారు. మంగళవారం రాయచోటిలోని శ్రీ సాయి శుభ కల్యాణ మండపంలో 10వ తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన మండల విద్యాశాఖాధికారులు, అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో ఎలాంటి ఆందోళనలు, భయం, బెరుకు లేకుండా ఎంతో ప్రశాంతంగా పరీక్షలు రాసే విధంగా సిద్ధం చేయాలని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని సూచించారు. అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు. ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాస రాజు మాట్లాడుతూ 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సమాంతరంగా ఓపెన్ టెన్త్ పరీక్షలు కూడా నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో మదనపల్లె ఉప విద్యాశాఖాధికారి శ్రీ రాం పురుషోత్తం, డీసీఈబీ నాగమునిరెడ్డి, ఈ కార్యక్రమంలో ఏఎంఓ రామకృష్ణ, డీఈవో కార్యాలయ ఏడీ ప్రసాద్‌బాబు, అన్ని పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, మోడల్ స్కూల్, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


ఘనంగా భీష్మ ఏకాదశి ఉత్సవం


మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిస్తున్న ఉత్సవ మూర్తులు

ఒంటిమిట్ట : ఏకశిలానగరి ఒంటిమిట్టలోని శ్రీ కోదండపాణి కోవెలలో మంగళవారం భీష్మ ఏకాదశి వేడుకను టీటీడీ వారు ఘనంగా నిర్వహించారు. శ్రీ సీతారామలక్ష్మణ సమేత మూలవరులకు పంచామృతాలతో అభిషేకించి నూతన పట్టు వస్త్రాలు, పుష్పమాలలు, ఆభరణాలతో అలంకరించి నివేదన సమర్పించారు. విష్ణు సహస్ర నామార్చనలు, ఆదిత్యహృదయం, స్త్రీసూక్తం, పురుషసూక్తం, హనుమాన్ చాలీసా పారాయణంతో వేదోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం సీతారామలక్ష్మణ సమేత ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా సింగారించి మంగళవాయిద్యాల నడుమ ఒంటిమిట్ట పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. గ్రామోత్సవంలో స్వామి వారికి భక్తులు కాయాకర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.

రయ్.. రయ్.. రైల్వేస్ జట్టు

- రెండు డబుల్ సెంచరీలు నమోదు
- ఒక సెంచరీతో చెలరేగిన బ్యాట్స్‌మన్
- ఆధిక్యంలో రైల్వేస్ జట్టు


బ్యాటింగ్ చేస్తున్న రైల్వేస్ జట్టు


రవిసింగ్ (258 పరుగులు)


అన్ష్‌యాదవ్ (235 పరుగులు)


అంచిత్ యాదవ్ (117 పరుగులు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న కల్నల్ సీకే నాయుడు అంతర్ రాష్ట్రాల అండర్-23 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో రైల్వేస్ జట్టు బ్యాట్స్‌మన్ చెలరేగిపోయారు. రెండు డబుల్ సెంచరీలు, ఒక సెంచరీతో బ్యాట్స్‌మన్ చెలరేగడంతో రైల్వేస్ జట్టు భారీ స్కోరు నమోదు చేసింది. 334 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మంగళవారం మూడోరోజు బరిలోకి దిగిన రైల్వేస్ జట్టు 174 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 638 పరుగుల భారీస్కోరు చేసింది. జట్టులోని ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ రవిసింగ్ 311 బంతుల్లో 258 (18 ఫోర్లు, 13 సిక్సర్‌లు) పరుగులు చేశాడు. ఈయనకు జతగా అన్ష్‌యాదవ్ 523 బంతుల్లో 235 (13 ఫోర్లు, 2 సిక్సర్‌లు) పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అంచిత్ యాదవ్ 191 బంతుల్లో 117 (12 ఫోర్లు, 1 సిక్సర్) పరుగులతో క్రీజులో నిలిచాడు. ఆంధ్రా బౌలర్లు సంతోష్, చెన్నారెడ్డి, వంశీకృష్ణ తలా ఒక వికెట్ తీశారు. కాగా మూడో రోజు ఆట ముగిసే సమయానికి రైల్వేస్ జట్టు 260 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

రేపు బ్రహ్మంగారిమఠం దేవస్థానంలో వేలం పాటలు

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో గురువారం ఉదయం 10గంటలనుంచి ఎండోమెంట్ ఏసీ, మఠం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ ఆధ్వర్యంలో దేవస్థానం మండపంలో వేలం పాటలు ఉంటాయని మేనేజర్ ఈశ్వరాచారి తెలిపారు. బహిరంగ వేలం పాటలలో భక్తులు సమర్పించుకుంటున్న తల వెంట్రుకలు, మరుగుదొడ్ల నిర్వహణ, దేవస్థానం ఆవరణంలో పుస్తకాలు విక్రయించుకొనేందుకు బహిరంగ వేలం పాటలు ఉంటాయన్నారు. ఇందుకు తల వెంట్రుకలకు రూ.25లక్షలు డిపాజిట్ నగదు లేదా డీడీ ఇవ్వాల్సి చ్చన్నారు.

దారి విషయమై ఇరువర్గాల ఘర్షణ

మదనపల్లె సిటీ : దారి విషయమై జరిగిన గొడవల్లో ఇరు వర్గాలకు చెందిన ముగ్గురు గాయపడిన సంఘటన మదనపల్లె పట్టణంలో మంగళవారం సాయంత్రం జరిగింది. అనపగుట్టకు చెందిన గంగాధర్, రామచంద్రలకు ఇంటి వద్ద దారి విషయమై కొంతకాలంగా గొడవలున్నాయి. ఈ క్రమంలో ఇరువర్గాల వారు గొడవపడి కొట్టుకున్నారు. ఈ గొడవలో ఓ వర్గానికి చెందిన గంగాధర్(40) మరో వర్గానికి చెందిన భార్యాభర్తలు రామచంద్ర(48),విజయలక్ష్మి(45)లు గాయపడ్డారు. వీరిని కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు టు టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఉపాధ్యాయులు తప్పనిసరిగా శిక్షణ పొందాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న కాంప్లెక్స్ సమావేశాలకు తప్పని సరిగా హాజరై శిక్షణ పొందాలని జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధ అన్నారు. మంగళవారం కడప నగర పాలక ఉన్నత పాఠశాల మెయిన్‌లో నిర్వహిస్తున్న కాంప్లెక్స్ సమావేశాల శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నెలా నిర్వహిస్తున్న కాంప్లెక్స్ సమావేశాలు కేటాయించిన షెడ్యూల్ ప్రకారం జరగాలని ఆదేశించారు. శిక్షణ సమయంలో ఉపాధ్యాయులెవరూ సెలవుగానీ, పర్మిషన్‌గానీ పెట్టరాదని, ఎంఈఓలు వాటికి అనుమతి ఇవ్వరాదని చెప్పారు. అనంతరం తరగతి గదిలో పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించడంతోపాటు పరీక్షలపై పలు సూచనలు సలహాలను ఇచ్చారు.

ఆర్ట్స్ కళాశాలలో స్నాతకోత్సవ సంబరం

- నేడు 2వ గ్రాడ్యుయేషన్ డే
- 393 మందికి డిగ్రీ పట్టాలు ప్రదానం

జిల్లాలోని యువతకు ఉన్నత విద్యనందించాలన్న లక్ష్యంతో 1948లో ఏర్పాటైన కళాశాలకు.. 1952లో అప్పటి ముఖ్యమంత్రి సర్ సి.వి. రాజగోపాలాచారి చేతుల మీదుగా పునాదిరాయి పడింది.. నేడు అదే ప్రాంతంలో ఆకట్టుకునే భవన నిర్మాణాలతో ఆర్ట్స్ కళాశాలగా రూపు దిద్దుకుంది. 1967లోనే 2 (ఎఫ్), 12 (బి) హోదాను సాధించిన కళాశాలగా.. 2003–04 సంవత్సరంలో తొలిసారిగా న్యాక్ గ్రేడ్ సాధించిన కళాశాలగా, 2012–13 సంవత్సరాలలో స్వయంప్రతిపత్తిని సాధించి ఎందరో విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఎమ్మెల్యేలు, మంత్రులుగా తీర్చిదిద్దిన చదువుల కోవెలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించనున్నారు.



ప్రభుత్వ పురుషుల కళాశాల

వైవీయూ : మద్రాసు ప్రభుత్వంలో 1948లో ఏర్పాటైన విద్యాలయం దాదాపు 75 సంవత్సరాల పాటు రాయలసీమ ప్రాంత ప్రజలకు విద్యాసుగంధాలు వెదజల్లుతూనే ఉంది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం అనుబంధంతో ఏర్పాటైన ప్రభుత్వ పురుషుల కళాశాల ఆర్ట్స్ కళాశాలగా ప్రారంభమైంది. అనంతరం 1968లో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి అనుబంధంగా, 2008లో కడప యోగి వేమన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉండేది. 2012–13లో స్వయంప్రతిపత్తి సాధించి అటానమస్ హోదాతో ప్రతియేటా దాదాపు 2వేల మందికిపైగా విద్యార్థులకు సేవలందిస్తోంది. 79 మంది అధ్యాపక బృందం (62 రెగ్యులర్, 13 కాంట్రాక్ట్, 4 గెస్ట్ లెక్చరర్లు)తో బోధన రంగం పటిష్టంగా ఉండటం విశేషం.

2వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు..

ఇప్పటి వరకు డిగ్రీ, పీజీ సర్టిఫికెట్‌లకు సంబంధించి విశ్వవిద్యాలయాలే స్నాతకోత్సవాలు నిర్వహించి పట్టాలు ప్రదానోత్సవం చేసేవారు. అయితే ప్రభుత్వం డిగ్రీ కళాశాలల్లో సైతం నిర్వహించేలా నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. దీంతో వరుసగా రెండో యేడాది గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. ఈ వేడుకల్లో 2022–23 విద్యాసంవత్సరాల్లో డిగ్రీ కోర్సు పూర్తిచేసుకున్న విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేయనున్నారు. కళాశాలలో 393 మంది పట్టాలు పొందేందుకు అర్హత సాధించగా, దాదాపు 200 మంది ప్రత్యక్షంగా బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే గ్రాడ్యుయేషన్ డేలో పట్టాలు అందుకోనున్నారు. వీరంతా స్నాతకోత్సవ వేడుకల్లాగా రోబ్స్ (నల్లని గౌన్లు) ధరించి అతిథుల చేతుల మీదుగా పట్టాలను అందుకోనున్నారు. మిగతా వారు పరోక్షంగా అందుకుంటారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, గౌరవ అతిథిగా ఏపీ కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్, వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, కడప ఆర్‌జేడీ డాక్టర్ పి. బాబు తదితరులు హాజరుకానున్నారు.

కళాశాల వివరాలు ఇలా..

- 1948లో ప్రస్తుత జెడ్పీ ఆవరణంలో కళాశాల ఏర్పాటు
- 1952లో ప్రస్తుతం ఉన్న ప్రాంతంలో అప్పటి ముఖ్యమంత్రి సర్ సీవీ రాజగోపాలాచారి చేతుల మీదుగా పునాదిరాయికి శిలాఫలకం ఆవిష్కరణ.
- 1954లో గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాలగా ప్రస్తుతం ఉన్న భవనాల్లో తరగతులు ప్రారంభం.
- 1967లో 2 (ఎఫ్), 12 (బి) హోదా.
- 1068లో తిరుపతి ఎస్వీయూకు అనుబంధం
- 1996లో జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల వేర్వేరు భవనాలు కేటాయింపు.
- 2003–04లో కళాశాలకు తొలిసారిగా న్యాక్ బి ప్లస్ గ్రేడింగ్
- 2008లో యోగివేమన విశ్వవిద్యాలయానికి అనుబంధం
- 2012–13 విద్యాసంవత్సరంలో స్వయంప్రతిపత్తి
- 2013లో న్యాక్ బి గ్రేడ్
- 2014లో చాయిస్‌బేస్డ్ క్రెడిట్ సిస్టం ఏర్పాటు
- 2013లో 2.76 జీపీఏతో బి గ్రేడ్
- 2019లో న్యాక్ బి గ్రేడ్.. (2024 వరకు)

విద్యార్థులకు గొప్ప అవకాశం



ప్రభుత్వ పురుషుల కళాశాలలో రెండవ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉంది. ఈ వేడుకల్లో 393 మంది విద్యార్థులు పట్టాలు పొందేందుకు అర్హత సాధించారు. వీరిందరికీ అతిథుల చేతుల మీదుగా పట్టాలు అందజేయనున్నాం. ఇప్పటి వరకు విశ్వవిద్యాలయాలకే పరిమితమైన ఈ ప్రక్రియను డిగ్రీ స్థాయిలో నిర్వహించడం సంతోషంగా ఉంది.

– డాక్టర్ జి. రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ పురుషుల కళాశాల, కడప